క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



వరుడితో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ముస్లిం మైనార్టీ కాలనీల్లో వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ నాయకుడు రహీమ్ అన్న కుమార్తె వివాహానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డి హాజరయ్యారు. వధువరులను ఆశీర్వదించారు. వారివెంట ఎంపీపీ ఈరన్న, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాడుగేని నాగరాజు, జిల్లా ఆర్టీఐ విభాగం కార్యదర్శి ప్రతాప్, ముస్లిం నియోజకవర్గ నాయకుడు షంషుద్దీన్, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



నివాళులర్పిస్తున్న వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి

మంత్రాలయం : మండల కేంద్రంలోని రాఘ వేంద్రపురానికి చెందిన వెంకటేష్ అనే యువకుడు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి వెంకటేష్ ఇంటికి వెళ్లారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అంత్యక్రియల ఖర్చులకుగానూ రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఆయనతో పాటు సర్పంచు తెల్లబండ్ల భీమయ్య, నాయకులు వడ్డె నారాయణ, రామాంజినేయులు ఉన్నారు.

పంచాయతీకి ఆదాయం పెంచండి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

గోనెగండ్ల: చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో ఎరువు తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం పెంచాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ సూచించారు. గురువారం మండలంలోని పెద్దనేలటూర్ గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఎంపీడీఓ మణి మంజరితో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఇంటింటికీ తిరిగి సేకరించిన తడి, పొడి చెత్తలను సంపద తయారీ కేంద్రాలకు తీసుకెళ్లి అక్కడ వేరు చేసి, వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయాలన్నారు. ఆ ఎరువును రైతులకు విక్రయించి పంచాయతీలకు ఆదాయం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేన, పంచాయతీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: పట్టణంలోని బండిమెట్ట కాలనీకి చెందిన నరసయ్య అనే వ్యక్తి కుటుంబ కలహాలతో గురువారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బంధువులు తెలిపిన మేరకు వివరాలు.. కుటుంబంలో సమస్యలతో మనస్థాపానికి గురై ఇంట్లో ఉరి వేసుకుంటుండగా భార్య గమనించి వెంటనే కిందకు దించింది. అపస్మారక స్థితిలో ఉన్న నరసయ్యను వెంటనే ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

విద్యుత్ వైర్ల దొంగపై కేసు నమోదు

పెద్దకడబూరు : పొలాల్లో బోరుబావులకు సంబంధించిన పంపుసెట్ల సర్వీసు వైర్ల దొంగపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన చంద్రయ్య (న్యాయవాది) పొలంలో బుధవారం సాయంత్రం నౌలేకల్లు గ్రామానికి చెందిన వెంకటేష్ పంపుసెట్లుకు ఉన్న విద్యుత్ సర్వీసు వైర్లను దొంగలించాడు. చుట్టుపక్క పొలం వారు గమనించి బాధిత రైతు చంద్రయ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. బాధిత రైతు గురువారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

ఆదోని రూరల్: మండలంలోని ఆఫీసరాళ్ల కొండల్లో నాటుసారా స్థావరంపై దాడిచేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్.కే.జె.సైదుల్ గురువారం తెలిపారు. 400 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి, 35 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఆదోని పట్టణంలోని వాల్మీకి నగర్‌కు చెందిన బోయ మురళి అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



చెన్నెహళ్లి సమీపంలో ఆంజనేయస్వామి దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై.ప్రదీప్‌కుమార్‌రెడ్డి



కోసిగి మార్కండేయ స్వామి ఆలయంలో ఆంజనేయుడికి భక్తుల పూజలు



నందవరంలో హనుమాన్ శోభయాత్ర



పెద్దనేలటూర్‌లో స్వామి వారికి కలశం తీసుకెళ్తున్న భక్తులు

శ్రీఆంజనేయం.. ప్రసన్నాంజనేయం



ఆదోనిలో రణమండల ఆంజనేయస్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి
- భక్తులతో కిక్కిరిసిన హనుమాన్ ఆలయాలు
- ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం



పెద్దకడబూరులో ఆంజనేయస్వామి ప్రభోత్సవం



ఎమ్మిగనూరులో హనుమాన్ విగ్రహం ఊరేగింపు



కౌతాళంలో హనుమన్ చిత్రపటంతో ఊరేగింపు

ఆదోని అర్బన్: హనుమాన్ జయంతి సందర్భంగా గురువారం పట్టణంలో ఆయా దేవాలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. పట్టణశివారులోని రణమండలకొండలో వెలసిన రణమండల ఆంజనేయస్వామికి ఆలయ నిర్వాహకులు టి.జి. పాండురంగయ్యశెట్టి ఆధ్వర్యంలో కార్తీకమాస నిత్య ప్రసాదసేవా సమితి వారు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, సింధూరసేవ, పూల అలంకరణ, వడలహారం, తులసీహారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా స్వామివారి చుట్టూ ఆలయ ప్రాంగణంలో రథోత్సవం నిర్వహించారు.

హనుమాన్‌కు ప్రత్యేక పూజలు

మంత్రాలయం : భక్తుల ఇష్ట దైవం వీర హనుమాన్ జయంతి వేడుకలు ఊరూర ఘనంగా జరిగాయి. హనుమంతుడి ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. జయంతిని పురస్కరించుకుని ఆంజనేయ స్వామికి ఆకుపూజ, అభిషేకాది అర్చనలు శాస్త్రోక్తంగా గావించారు. మంత్రాలయం, చిలకలడోణ, మాలపల్లి, మాధవరం, చెట్నెహళ్లి తదితర గ్రామాల్లో వేడుకలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెట్నెహళ్లి గ్రామం మోహినీపురంలో అభయాంజనేయుడి సేవలో తరించారు. మంత్రాలయంలోని గోశాలలో వెలసిన ఏకశిలా అభయాంజనేయ స్వామి సన్నిధానంలోనూ భక్తుల రద్దీ కనిపించింది. ఆంజనేయస్వామి సేవలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భీమారెడ్డి, సర్పంచు అంజినయ్య, ఎంపీటీసీ రామాంజినేయులు, మాజీ సర్పంచు అల్లింగప్ప, ఉప సర్పంచు తిక్కస్వామి పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మార్కండేయ స్వామి ఆలయంలో కొలువుతీరిన ఆంజనేయ స్వామికి ఆలయ అర్చకులు వీరేష్ స్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు చేపట్టారు. వేకువ జామున నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి వారికి నారికేలలు సమర్పించి పూజలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని తేరుబజారు ఆవరణలో వెలసిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద హరికృప యూత్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నర్విహించారు.

పెద్దకడబూరు: హనుమాన్ జయంతిని మండల పరిధిలోని తారాపురం, చిన్నకడబూరు, పెద్దకడబూరు, బసలదొడ్డి, కంబలదిన్ని తదితర గ్రామాలలో గురువారం ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పెద్దకడబూరులోని చావిడి వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి పెద్దకొండ దగ్గర వెలసిన పాతూరు ఆంజనేయస్వామి ఆలయం వరకు ప్రభోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. పాతూరు ఆంజనేయస్వామి ఆలయంలో రాత్రి చేసిన భజన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

గోనెగండ్లలో వేడుకలు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు అలువాల, పెద్దనేలటూర్, గాజులదిన్నె, హెచ్. కైరవాడి, వేముగోడు, కులుమాల, గంజిహళ్లి తదితర గ్రామాల్లో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా దేవాలయాలను భక్తులు విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం నుంచే భక్తులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గోనెగండ్లలోని సీతారామాంజినేయ స్వామి దేవాలయంలో టీటీడీ హిందూ ధర్మ ప్రచారపరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ జయంతి

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంజనేయస్వామి దేవాలయాలలో ఉదయం స్వామి వారి మూలవిరాట్‌కు శుద్ధ జలాలతో, పాలాభిషేకం చేసి ఫలపుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలను చేసి మహామంగళహారతులిచ్చారు. నాయీబ్రహ్మణ సేవ సంఘం ఆధ్వర్యంలో అనంత మంగళ మారుతి సాయిరామ్ దేవస్థానంలో హనుమన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆలయంలో హనుమాన్ చాలీసా జపించి హోమం చేపట్టారు. మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, వైస్ ఎంపీపీ బుజ్జీస్వామి, కౌతాళం మాజీ సర్పంచ్, వివిధ పార్టీల నాయకులు జయంతి ఉత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. కౌతాళంలో సాయంత్రం గ్రామ పూర వీధుల గుండా హనుమన్ చిత్రపటానికి ఊరేగింపు నిర్వహించారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక సోగనూరు రోడ్డులోని ఆలయంతో పాటు వీవర్స్ కాలనీ, మిలటరీ కాలనీ,పాత ఆంజినేయ స్వామి తదితర ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచిపూజలు నిర్వహించారు.రాత్రి పట్టణంలో శ్రీ హనుమాన్ విగ్రహన్ని ఊరేగిపు నిర్వహించారు. సోమప్ప సర్కిల్‌లో మహిళా భక్తులు కోలాటం చేశారు.

స్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం, సింధూరాభిషేకం, ఆకుపూజ, విశేషార్చన, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. అలాగే స్వామి వారికి వెండి, ప్రత్యేక పూలతో అలంకరించి పూజలు చేశారు. అలాగే వీవర్స్ కాలనీలో ఆంజనేయ స్వామికి ఆకుపూజ సిందూర అలంకరణ చేశారు. సాయంత్రం భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ధార్మిక ప్రవచకులు తులశమ్మ, కార్యనిర్వహకుడు డాక్టర్ మల్లు వెంకట రెడ్డి, సత్యనారాయణ, మునిస్వామిగౌడ్, శ్రీరాములు, విశ్వనాథ రెడ్డి, శివ శంకర్, కోటయ్య, మునెప్ప, గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర

నందవరం : మండల కేంద్రం నందవరంతో పాటు నదికై రవాడి, మాచాపురం, గంగవరం, గురజాల, రాయచోటి, ఇబ్రహీంపురం, ముగతి, నాగలదిన్నె, కనకవీడు, సోమలగూడూరు తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ముందుగా ఆయా గ్రామాల్లో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి, పిండి వంటలతో నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని శివాలయం వద్ద వెలసిన ఆంజనేయ స్వామి కట్ట వద్ద భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం మహిళలు కలశాలతో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో చిన్నారుల కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

మంగరాయ సన్నిధిలో శాంతిహోమం



దోశ నివారణ శాంతిహోమం నిర్వహిస్తున్న పండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ

ఆదోని అర్బన్: పట్టణశివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన మంగరాయ సన్నిధిలో గురువారం సకలవిధ ప్రతిబంధక దోష నివారణ శాంతి హోమం నిర్వహించారు. ఆలయ మేనేజర్ భీమసేన ఆధ్వర్యంలో ముందుగా స్వామివారికి పంచామృతాభిషేకం, పారాయణం, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు చేపటారు. అనంతరం మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థుల శ్రీపాదులవారి ఆదేశాల మేరకు అన్ని రాశులవారికి విద్య, ఉద్యోగం, వివాహం, సంతానం, ఆరోగ్య విషయంలో ఉన్న దోష పరిహారం కోసం సకలవిధ ప్రతిబంధక దోష నివారణ శాంతిహోమం పండితుడు గరుడాద్రి దత్తాత్రేయశర్మ జరిపించారు.

గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి



నందవరం పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ రేవతి

నందవరం : గర్భిణులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుంగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ రేవతి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ ప్రీ-ఎక్లాంప్సియా దినోత్సవం సందర్భంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ..ప్రీ-ఎక్లాంప్సియా అనేది వ్యాధి గర్భధారణ సమయంలో మహిళలకు అధిక రక్తపోటు పెరగడంతో సంభవిస్తుందన్నారు. ఈ వ్యాధి వల్ల గర్భధారణలో మహిళలకు రక్తపోటు, తలనొప్పి, మసక దృష్టి, శ్వాస ఆడకపోవడం, వికారం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయని వివరించారు. దీని నివారణకు ప్రతి గర్భిణి పౌష్టికాహారం, చిన్నపాటి నడక, తగిన విశ్రాంతితో పాటు క్రమం తప్పకుండా డాక్టర్ల వద్ద ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని చెప్పారు. ఎంపీహెచ్ఎస్‌లు సుశీల, శ్రీనివాసులు, హెల్త్ సిబ్బంది , ఆశాలు పాల్గొన్నారు.

పొలం విషయంలో ఘర్షణ

కోసిగి: మండల పరిధిలోని కందుకూర గ్రామానికి చెందిన గూడ్ల ఉసేని, దోసయ్యగారి అయ్యన్నల కుటుంబ సభ్యుల మధ్య పొలం విషయంలో గురువారం ఉదయం ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామంలో సర్వే నెంబర్ 352ఏ, 352బీల పరిధిలో 17.82 ఎకరాల భూమి విషయంలో కొద్ది కాలంగా వివాదంగా ఉంది. ఈ విషయంలో గురువారం ఉదయం ఓ వర్గం భూమిలో సాగు చేసేందుకు సిద్ధం కాగా మరో వర్గం అక్కడికి చేరుకుని గొడవకు దిగింది. ఇరువర్గాలు కర్రలతో కొట్టుకున్నారు. ఇందులో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయాలైన వారికి కోసిగి ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాల కుటుంబ సభ్యులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు అటు 12మంది, ఇటు 12మంది పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నాగరాజు తెలిపారు.

దర్గాలో ఫాతెహాలు



ఖాదర్‌లింగస్వామి దర్గాలో ఫాతెహాలు నిర్వహిస్తున్న దృశ్యం

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

గోనెగండ్ల : జూన్ 21న జరిగే అంతర్జాయతీ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ మణి మంజరి కోరారు. గురువారం మండల కేంద్రం గోనెగండ్లలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బందితో యోగాపై సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జూన్ 21న నిర్వహించే యోగా కార్యక్రమానికి మండల కమిటీని ఎంపిక చేసినట్లు తెలిపారు. మండల కమిటీలో చైర్మన్‌గా ఎంపీడీఓ మణి మంజరి, మెంబర్లుగా తహసీల్దార్ కుమార స్వామి, ఎంఈఓ రామాంజినేయులు, డాక్టర్ రంగ రవళి, ఏపీఎం హేమలత, ఏపీఓ మహమ్మద్ బాషాలు ఎంపికయ్యారన్నారు. అనంతరం గ్రామస్థాయి కమిటీని గ్రామాల్లో ఎన్నుకుంటారన్నారు. కమిటీల ద్వారా యోగా పై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ విజయ భాస్కర్, తహసీల్దార్ కుమారస్వామి, ఎంఈఓ రామాంజినేయులు, ఈఓఆర్డీ అనంతసేన, ఏపీఓ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నేడు డీలర్ల సమావేశం

మంత్రాలయం : పేదల రేషన్ పంపిణీ విధానంలో రాష్ట్ర ప్రభుత్వం ఎండీయూ వాహనాలు తొలగించాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం తహసీల్దార్ ఎస్.రవి నేతృత్వంలో డీలర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి వాహనాలు నిలిచిపోనున్నాయి. చౌకదుకాణాల వద్దకు వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో మండలంలోని డీలర్లందరూ సమావేశానికి రావాలని తహసీల్దార్ రవి ఆదేశించారు.

రాఘవుడి సన్నిధిలో హెచ్.డి.రేవణ్ణ



పీఠాధిపతి చేతుల మీదుగా అక్షింతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రేవణ్ణ

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ కుమారుడు, కర్ణాటక ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణ గురువారం మంత్రాలయం విచ్చేశారు. ఆయన ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని అర్చనలు చేసుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫలపూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఆదోని టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని ఆదోని మున్సిపల్ ఇంజినీరింగ్ వర్కర్ల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ టెక్నికల్ అండ్ నాన్ టెక్నికల్‌కు జీతం రూ.29,200, రూ.24,500 చొప్పున అందించాలన్నారు. 15 సంవత్సరాలు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలని, 55 ఆదివారాలు, 17 దేశ, జాతీయ, రాష్ట్ర పండగలు, 72 రోజులను సెలవులుగా ప్రకటించాలన్నారు.

ప్రభుత్వమే పత్తి విత్తనాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న లక్ష్మీ నారాయణరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోగా రాష్ట్ర ప్రభుత్వమే రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను పంపిణీ చేయాలని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం లక్ష్మీ నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏటా జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా వుండటం వలన వచ్చే ఖరీఫ్ సీజన్‌లో కుడా రైతులు ఆ పంటనే సాగు చేసేందుకు సమయాత్తం అవుతున్నారన్నారు. ఖరీఫ్ సీజన్ సమీపిస్తుండటంతో మార్కెట్‌లో నకిలి పత్తి విత్తన విక్రయాలు పెరిగే అవకాశం వుందని, వాటిని ప్రభుత్వమే కట్టడి చేయాలన్నారు. రైతుల శ్రేయస్సుకోసం ప్రభుత్వం గుర్తింపు పొందిన సంస్థల ద్వారా నాణ్యమైన పత్తి విత్తనాలను సేకరించి రైతులకు పంపిణీ చేయాలని కోరారు.

మద్యం అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి



మాధవరం చెక్‌పోస్టు తనిఖీ చేస్తున్న డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

మంత్రాలయం : కర్ణాటక నుంచి మద్యం అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ (ఐపీఎస్) ఆదేశించారు. గురువారం ఆయన ఎక్సైజ్‌శాఖ బృందంతో సరిహద్దు మాధవరం చెక్ పోస్టును ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన చెక్‌పోస్టులో తనిఖీ తీరు, రికార్డులు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కర్ణాటక, తెలంగాణ ప్రాంతాల నుంచి మద్యం ఆంధ్రలోకి రాకుండా నిరంతరం నిఘా ఉంచాలన్నారు. విధుల్లో ఏమాత్రం నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని చెప్పారు. ముఖ్యంగా సీసీ కెమెరాలు, రికార్డులు నిర్వహణ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ పోతుల శ్రీదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ హనుమంతరావు, సూపరింటిండెంట్ సుధీర్‌బాబు, ఎమ్మిగనూరు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి ఉన్నారు.

అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి



అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అవేష్‌తో దురుసుగా ప్రవర్తిస్తున్న అడ్వకేట్ చంద్రప్ప

ఆదోని రూరల్: వాహనాలను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అవేష్ విధులకు ఆటంకం కలిగిస్తూ, ఆయనపై దాడికి పాల్పడిన అడ్వకేట్ చంద్రప్ప అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తాలూకా ఎస్ఐ రామాంజనేయులు గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాహనాల తనిఖీ చేపట్టారు. అదేసమయంలో మంత్రాలయం నుంచి కర్ణాటకకు వెళ్తున్న మినీ ట్రావెల్ బస్సు తనిఖీలో భాగంగా అందులో ఉన్న ప్యాసింజర్లను కిందకు దింపి రికార్డులను అడుగగా.. చంద్రప్ప అనే న్యాయవాది నీవు అసలైన రవాణాశాఖ అధికారివేనా, నీకు ఏమి అధికారం ఉందని, మా వాహనాన్ని ఆపావని దుర్భాషలాడుతూ దాడి చేశాడు. విధులకు ఆటంకం కలిగించాడు. అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కానిస్టేబుల్‌కు రివార్డు



డీఎస్పీ చేతుల మీదుగా రివార్డు అందుకుంటున్న కానిస్టేబుల్ ఖాజా

మంత్రాలయం:మంత్రాలయం పోలీస్ స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న ఖాజా గురువారం డీఎస్పీ ఉపేంద్రబాబు చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. నిత్యం రద్దీగా ఉండే మంత్రాలయం రాఘవేంద్ర సర్కిల్ ట్రాఫిక్ విషయంలో ఖాజా చాకచక్యంగా విధులు నిర్వహిస్తుండటంతో రివార్డుకు ఎంపికయ్యారు. డీఎస్పీ చేతుల మీదుగా రూ.2 వేలు రివార్డును అందుకున్నారు. అందుకు మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ కానిస్టేబుల్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

కోలుకోలేక యువకుడి మృతి

ఆదోని రూరల్: మండలంలోని హాన్వాల్ గ్రామానికి చెందిన హరిజన రాజు(20) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు ఇస్వీ ఎస్ఐ డాక్టర్ నాయక్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. రాజు హొళగుంద మండలం ఎం డి.హళ్లి కొత్తూరు గ్రామానికి చెందిన మహిమ జ్యోతి అనే అమ్మాయిని ప్రేమించి ఈనెల 15వ తేదీన ఉరుకుంద ఈరన్నస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నాడు. అయితే అమ్మాయి తల్లిదండ్రులు చర్చిలో పెళ్లి చేస్తామని చెప్పడంతో రాజు ఇష్టం లేక మనస్థాపం చెంది ఈనెల 15న పురుగు మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం రాజును ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక గురువారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. రాజు తల్లి ఈరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.